ఐఐటి విద్యార్థి రమేష్‌కు అభినందన సభ

టి.నరసాపురం :విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రిటైర్డ్ ప్రిన్సిపల్ టి.నరసింహస్వామి తెలిపారు. మండలంలోని అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల (బాలుర)లో చదివిన పూర్వ విద్యార్థి నూనె రమేష్ ఐఐటి ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.కిషోర్ కుమార్ అధ్యక్షతన ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టివిఎస్.స్వామి మాట్లాడుతూ ఐసి బ్రాంచ్ ఆలిండియా ఎస్‌సి కేటగిరీలో 1872వ ర్యాంకు సాధించి ఐఐటి ధన్‌బాద్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రమేష్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఐఐటి విద్యార్థి రమేష్ మాట్లాడుతూ పదో తరగతిలో అప్పటి ప్రిన్సిపల్ స్వామి, మిగిలిన ఉపాధ్యాయుల స్ఫూర్తితో ఐఐటికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, లక్ష్మి, బేబి, రారాజు, తిరుపతయ్య పాల్గొన్నారు.

తల్లికి 'వంచన'..!

'తల్లికి వందనం' సొమ్ములందక కాళ్లరిగేలా తిరుగుతున్న తల్లులు

తొలివిడతలో చూపిన సమస్యలు పరిష్కరించినా ఫలితం శూన్యం

వేలాది కుటుంబాలకు అన్యాయం

ఏలూరు జిల్లాలో 40 వేల మందికి అందని సొమ్ము

పశ్చిమగోదావరి జిల్లాలోనూ వేలాది మందికి నిరాశే

పిజిఆర్ఎస్‌కు వచ్చి ఘొల్లుమంటున్న తల్లులు

'ఈ ఫొటోలో ఉన్న ఆమె పేరు సయ్యద్ ఇమామ్‌బీ. ఏలూరులోని వెంకటాపురం. ఈమెకు ఇద్దరు మగ, ముగ్గురు ఆడపిల్లలు. మొత్తం ఐదుగురు సంతానం. ఐదుగురు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. వీరికి సొంత ఇల్లు కూడా లేదు. వేరే విద్యుత్ కనెక్షన్లు ఈమె పేరున నమోదైనట్లు చూపి 'తల్లికి వందనం' నిలిపేశారు. దీంతో విద్యుత్ అధికారులు వీరి కుటుంబానికి ఎటువంటి విద్యుత్ కనెక్షన్లూ లేవని ధ్రువీకరణ పత్రం ఇచ్చి ఆన్‌లైన్‌లో తొలగించినా రెండో విడతలోనూ ఆమె పిల్లలకు సొమ్ము పడలేదు. దీంతో ఆమె అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతోంది'.

'ఈమె పచ్చవ లక్ష్మి, భీమడోలు మండలం పూళ్ల గ్రామం, ఇద్దరు ఆడ పిల్లలు. ఇరువురు పూళ్ల హైస్కూల్‌లో ఎనిమిది, ఆరో తరగతులు చదువుతున్నారు. వేరే విద్యుత్ కనెక్షన్ ఈ కుటుంబం పేరున చూపిస్తూ తల్లికి వందనం నిలిపివేశారు. తప్పుగా నమోదైనట్లు విద్యుత్ అధికారులు ధ్రువీకరించినా, సరిచేయించుకున్నా సొమ్ములు పడలేదు. దీంతో ఆ నిరుపేద కుటుంబం బాధ వర్ణనాతీతంగా మారింది'.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న ఇద్దరు తల్లులే కాదు. రెండు జిల్లాల్లో దాదాపు 80 వేల మంది తల్లులను ప్రభుత్వం వంచనకు గురి చేసింది. అర్హతున్నా రకరకాల కారణాలు చూపుతూ తల్లికి వందనం సొమ్ము అందకుండా చేసింది. దీంతో పిల్లల తల్లులంతా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. విద్యుత్, నాలుగు చక్రాల వాహనం, భూములు ఎక్కువగా ఉన్నట్లు చూపి ఎంతోమందికి 'తల్లికి వందనం' తొలివిడతలో నిలిపివేశారు. గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని, సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రభుత్వం చెప్పింది. దీంతో తొలివిడత జాబితాలో పేర్కొన్న సమస్యలకు సంబంధిత శాఖల నుంచి పత్రాలు తీసుకుని గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించారు. అయినప్పటికీ ఈ నెల పదో తేదీన విడుదల చేసిన రెండో విడత జాబితాలోనూ వారి పేర్లు లేకుండాపోయాయి. ఏలూరు జిల్లాలో మొత్తం 2.40 లక్షల మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించగా, ఇంకా 40 వేల మందికి తల్లికి వందనం సొమ్ము జమ కాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో 1.76 లక్షల మంది అర్హులైన విద్యార్థులు ఉన్నప్పటికీ దాదాపు 40 వేల మందికి తల్లికి వందనం అందలేదని తెలుస్తోంది. తల్లికి వందనం నిలుపుదల చేస్తూ ఏ సమస్యనైతే చూపించారో సమస్యను పరిష్కరించినా అర్హత లేనట్లు చూపిస్తున్న పరిస్థితి నెలకొంది. 'తల్లికి వందనం'లో సమస్యలను పరిష్కరించేందుకు సరైన వ్యవస్థ లేకుండాపోయింది. ఫిర్యాదులు వస్తే తీసుకోవడం తప్పితే తమకు ఏమీ తెలియదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో వేలాది నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందకుండాపోయింది. ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్‌లోనూ తల్లులు పెద్దఎత్తున వచ్చి తమ సమస్యను అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. 'తల్లికి వందనం'కు సంబంధించిన వివరాలు సైతం అధికారుల వద్ద లేకుండాపోయాయి. దీంతో ఏం జరుగుతుందో ఏఒక్కరికీ అర్థం కాకుండాపోయింది. కనీసం ఉండటానికి ఇళ్లు లేనివారికి కూడా 'తల్లికి వందనం' నిలిపేసిన పరిస్థితి ఉంది. దీనిపై సచివాలయాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నా సొమ్ములు వస్తాయో, లేదో తెలియని దుస్థితి నెలకొంది. తల్లికి వందనం సొమ్ము జమైన వారు సైతం ఆ సొమ్ము ఏఖాతాలో పడ్డాయో తెలియని అయోమయం నెలకొంది. సచివాలయాల్లోనూ ఆ వివరాలు చెప్పడం లేదు. ఈ నేపథ్యంలో తల్లికి వందనం సమస్య పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తల్లులు కోరుతున్నారు. అందరికీ సొమ్ము అందేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే పేద కుటుంబాలకు న్యాయం జరుగుతుంది.

ఏం కష్టమొచ్చిందో..!

పుట్టినరోజునాడే ఉరేసుకుని ఉపాధ్యాయురాలు ఆత్మహత్య

బ్లేడుతో నరాలు కోసుకుని భర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వారిద్దరూ ఉన్నత విద్యావంతులు. భార్య ఉపాధ్యాయురాలిగా, భర్త ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఎంతోమంది భావి భారత పౌరులను తీర్చిదిద్దారు. మరికొంతమంది భావి భారత పౌరులను తీర్చిదిద్దేందుకు వారు సిద్ధంగా ఉన్న తరుణంలో భార్య ఉరేసుకుని మృతి చెందింది. ఆమె పుట్టినరోజునాడే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను ఆ స్థితిలో చూసిన భర్త తాను కూడా తనువు చాలించాలని బ్లేడుతో ఒంటిపై ఉన్న నరాలను పలుచోట్ల కోసుకున్నాడు. ప్రస్తుతం అతను ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడి చికిత్స పొందుతున్నాడు. ఏలూరు రూరల్ పరిధిలోని చొదిమెళ్ల ప్రాంతంలో శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదపాడు మండలం నాయుడుగూడెం గ్రామానికి చెందిన చిన్ని సురేంద్ర, నూజివీడు ప్రాంతానికి చెందిన దేవిక(40)కు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి పవన్‌తేజ, గౌతమ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు పవన్‌తేజ విజయవాడ చైతన్య కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. చిన్న కుమారుడు గౌతమ్ గుడివాడ కెకెఆర్ గౌతమ్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వీరిద్దరూ హాస్టల్లో ఉంటున్నారు. సురేంద్ర, దేవిక ఏలూరు రూరల్ పరిధిలోని చొదిమెళ్ల ప్రాంతంలో శ్రీవల్లి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. సురేంద్ర ప్రస్తుతం ఉంగుటూరు మండలం రాచూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్నారు. వివాహమయే సమయానికి సురేంద్ర ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. దేవిక డిగ్రీ వరకు చదివి అక్కడితో ఆపేసింది. వివాహం అనంతరం సురేంద్ర ఆమెను టీచర్ చదివించాడు. అనంతరం ఆమె ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం ఆమె ఉంగుటూరు మండలం నల్లమాడు ఎలిమెంటరీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిరోజు లాగానే శనివారం కూడా భార్యాభర్తలు పాఠశాలకు బయలుదేరి వెళ్లారు. పాఠశాల ముగిసిన అనంతరం దేవిక సాయంత్రం త్వరగా ఇంటికి చేరుకున్నారు. సురేంద్ర ప్రధానోపాధ్యాయులు కావడంతో తన విధులు ముగించుకుని ఆలస్యంగా రాత్రికి ఇంటికి వచ్చారు. దేవిక తలుపులు తీయకపోవడంతో సురేంద్ర తన వద్ద ఉన్న రెండో తాళం చెవితో తలుపులు తీసుకుని లోపలికి వెళ్లి చూడగా దేవిక చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. దీంతో అయోమయానికి గురైన అతను ఇంట్లో ఉన్న బ్లేడుతో చేతులపై, కాళ్లపై నరాలను కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదే సమయంలో నాయుడుగూడెంలో ఉండే సురేంద్ర సోదరుడు పలుమార్లు సురేంద్రకు, అతని భార్యకు ఫోన్ చేశాడు. ఇద్దరు ఎంతకీ ఫోన్ ఆన్సర్ చేయకపోవడంతో వెంటనే బయలుదేరి అపార్ట్‌మెంట్‌కు వచ్చేసరికి సురేంద్ర రక్తపుమడుగులో పడి ఉన్నాడు. దేవిక ఫ్యాన్‌కు వేలాడుతూ ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి సురేంద్రను చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దేవిక మృతదేహాన్ని కిందకు దింపి శవపరీక్ష నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం సురేంద్ర ఏలూరు సర్వజన ఆసుపత్రి ఐసియు విభాగంలో చికిత్స పొందుతున్నారు.

నా భార్య లేకపోతే నాకు జీవితం లేదు : సురేంద్ర

నా భార్య ఆత్మహత్యకు పాల్పడడంతో నేను షాక్‌లో చనిపోదామనే ఉద్దేశంతో చేతులపై, కాళ్లపై నరాలను కోసుకున్నాను. నా కుమారులిద్దరూ చక్కగా చదువుతున్నారు. ప్రయోజకులయ్యేందుకు నా తండ్రి, బావమరిది సహాయం చేస్తారని భావించాను. మాకు ఆర్థికంగా కూడా ఎటువంటి ఇబ్బందులు లేవు. మేము చనిపోతే నా పిల్లలు ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు పడరు. వారు స్థిరపడేందుకు, వారు చదువుకు కావాల్సిన ఆర్థిక బలం మాకు ఉంది. నేను చనిపోదామని నిర్ణయించుకోవడానికి ఒకే ఒక కారణం దేవిక లేని జీవితం ఇక వ్యర్థమని మాత్రమే అలా చేశాను.

భార్యాభర్తలిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు దేవిక తల్లిదండ్రులు

భార్యభర్తలిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారని, సాధారణంగా భార్యాభర్తల మధ్య ఉండే మనస్పర్థలే తప్ప వారి మధ్య ఎటువంటి ఇతర విబేధాలు లేవని, ఆర్థికంగా కూడా వారు బలంగా ఉన్నారని, అన్ని విషయాల్లో దేవికకు సురేంద్ర సహాయంగా ఉంటారని మృతురాలి తల్లిదండ్రులు చెప్పారు.

ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తున్న బోర్డుపై రాతలు

మమ్మి, డాడి ఐ లవ్ యు అని వైట్ బోర్డు మీద రాసి ఉంది. దాని కింద దేవిక సంతకం పెట్టి ఉంది. అలాగే దాని కింద ఐఐటి సిఎస్‌సి ముంబై అని కూడా రాసి ఉంది. ఐఐటిలో సీటు సాధించి సిఎస్‌సి బ్రాంచిలో చేరాలని అయి ఉండవచ్చని పలువురు అంటున్నారు. కింద పెద్ద అక్షరాలతో రక్తంతో ఐ లవ్ యు అని బ్లేడుతో కోసుకున్న అనంతరం సురేంద్ర రాశాడు. ఇంకా కొన్ని రాతలు ఉన్నప్పటికీ రక్తం ఆ వైట్ బోర్డ్‌పై పడడంతో సరిగా తెలియడం లేదు.

కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుమారులు

తల్లి చనిపోవడం, మరోపక్క తండ్రి ఆసుపత్రి పాలవడంతో ఉదయం ఆసుపత్రికి చేరుకున్న పవన్‌తేజ, గౌతమ్‌లు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇది చూసిన వారి కుటుంబ సభ్యులు కూడా కంటతడి పెట్టారు.

మానసిక స్థితి సరిగా లేదా..!

విద్యావంతులు భావి భారత పౌరులను తీర్చిదిద్దేవారు కూడా పరిస్థితులను చక్కబెట్టుకోకుండా ఆత్మహత్యకు, ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం వారి మానసిక స్థితి తెలియజేస్తుందని, ఇటువంటి మానసిక స్థితి ఎప్పటికైనా ప్రమాదకరమని నిపుణులు సూచిస్తున్నారు. దేవిక కొంత షార్ట్ టెంపర్‌గా వ్యవహరించేదని, భర్త ఏ విషయంలో అయినా నో చెప్తే తాను విపరీతంగా బాధపడేదని దేవిక తరపు బంధువులు చెబుతున్నారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె ఆదివారం ఏడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎల్.రంగారావు మాట్లాడుతూ మున్సిపాల్టీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు గత ఏడు సంవత్సరాలుగా జీతాలు పెంచకపోవడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారు వేతనాలు పెంచాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

పత్తేపురం కాల్వలోకి సాగునీరు ఉరకలు

తోకలపల్లి ప్రధాన మురుగు కాల్వ లాకుల చెక్కలను దించడమే కారణం

రావులపర్రు బాడవ కింద నారుమడులు మునక.. కుళ్లిన నారు

నష్ట పరిహారం ఇవ్వాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైతే దేశానికి వెన్నెముక అంటూనే సన్న, చిన్నకారు, వరి సాగుదారులను నట్టేట ముంచేస్తున్నారని రావులపర్రు రైతులు ఆదివారం ధర్నా చేపట్టారు. చేపల చెరువుల్లో నీళ్లు నింపేందుకు రావులపర్రు (నీటి నియంత్రణ) లాకుల చెక్క బళ్లలను కిందకు దించేయడంతో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో రాచూరు-పత్తేపురం పంట కాల్వ బాడవ కింద సుమారు 150 ఎకరాలకు సంబంధించి నారుమడులు వారం రోజులుగా నీటిలో ఉండిపోవడంతో నారంతా కుళ్లిపోయి రైతులు ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. పొలాల్లో నీరు తగ్గకపోతే సార్వా సాగు ఇక వదిలేసుకోవాల్సి వస్తుందని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

కుళ్లిన నారుమడి

లాకుల చెక్క బళ్లల ఎత్తు పెంచేశారు

ఏలూరు కాల్వ కింద ఉప్పాకపాడు వద్ద యూటీ మీదుగా మెట్ట ప్రాంతాల నుంచి వరద, మురుగు నీరంతా తోకలపల్లి మేజర్ మురుగు కాలువ ద్వారా కొల్లేరులోకి వెళ్లాల్సి ఉంది. వర్షాకాలంలో అధిక నీటి వల్ల పొలాలు మునిగిపోకుండా నీటి హెచ్చుతగ్గులను అరికట్టేలా రావులపర్రు వద్ద లాకులను ఏర్పాటు చేశారు. ఈ లాకుల నిర్వహణకు గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో నిడమర్రు మండల చేపల చెరువుల రైతులు చెక్కలను సొంతంగా తయారు చేయించి ఎత్తు పెంచి బిగించుకున్నారు. చెరువులకు నీటిని పెట్టుకోవాలంటే పిల్ల కాలువలు, బోదెల్లోకి నీటి ప్రవాహం పెరగాలంటే రావులపర్రు వద్ద లాకులను ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారుల సమన్వయంతో నియంత్రించాల్సి ఉంది. అయితే చేపల చెరువుల కోసమే నీటిని వదలడంతో బాడవ కింద పొలాల్లోకి రెండు అడుగుల మేర నీరు చేరింది.

మరమ్మతులు లేని డ్రెయిన్లు

వివిపురం, కాకర్లమూడి, దొంతవరం, రావులపర్రు, రాచూరు, సీతారామపురం పొలాల్లో వరద, అదనపు మురుగు నీరంతా పందికోడు ద్వారా కొల్లేరులోకి వెళ్లాల్సి ఉంది. అయితే మురుగు బోదెలు ఆక్రమణ, నిర్వహణా లోపం కారణంగా ఎక్కడికక్కడ పూడుకుపోవడంతో చుక్క నీరు దిగువకు వెళ్లని పరిస్థితి.

లాకుల వద్ద ఆందోళన చేస్తున్న కౌలు దారులు

దీంతో సన్న చిన్నకారు, కౌలు రైతులు వరి సాగంటేనే ఆందోళనకు గురవుతున్నారు.

సమస్య పరిష్కరించకుంటే రోడ్డెక్కుతాం
టి.రాజ్‌కుమార్, కౌలురైతు, రావులపర్రు

చేపల చెరువులకు నీటి నిమిత్తం కాలువ బళ్లలను దించేయడం వల్లే బాడవ కింద పొలాల్లో మూడు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. దాళ్వాలో కూడా పంట చేతికొచ్చిన టైమ్‌లో బళ్లలను దించేయడంతో పంట కోసుకునే అవకాశం లేకుండా చేశారు. అప్పుడు పంట వదులుకోవాల్సి వచ్చింది. మళ్లీ ఇప్పుడు అదే తంతు జరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం చేపల చెరువుల యజమానులకే మద్దతు పలుకుతున్నారు తప్ప సామాన్య రైతుల గోడు వినడం లేదు. అదికారులేమో ప్రజాప్రతినిధులు చెప్పినట్లు చేస్తున్నాం...మా చేతుల్లో ఏమీ లేదంటున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే సోమవారం రైతులంతా ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తాం.

ఆరెకరాల నారుమడి పూర్తిగా కుళ్లింది
యడవల్లి శ్రీను, కౌలుదారు, రావులపర్రు

ఆరు ఎకరాలు సాగు చేసేందుకు నారుమడి సిద్ధం చేశాను. నాలుగు బస్తాల విత్తనాలకు రూ.6 వేలు, దుక్కు దున్నడానికి రూ.3500, ఎరువులకు రూ.1800, అన్ని ఖర్చులతో రూ.11,300పైనే అయ్యింది. ఫత్తేపురం చేపల చెరువు కోసం నీటిని తీసుకెళ్లేందుకు తోకలపల్లి డ్రెయిన్ రెగ్యులేటర్ చెక్కలను కిందకు దించేశారు. అందువల్లే ఫత్తేపురం పంట కాలువ ప్రవాహ ఉధృతి పెరిగి నారుమడులు మునిగిపోయాయి. నీరు తగ్గితే కాని మళ్లీ నారుమడులు సిద్ధం కావు.

పట్టించుకోని అధికారులు,ప్రజాప్రతినిధులు
నల్లి హరికృష్ణ, కౌలుదారుడు, రావులపర్రు

అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నా. నిడమర్రు మండలంలో చేపల చెరువు కోసం నీటి ప్రవాహాన్ని పెంచేయడం వల్లే మా పొలాలు మునిగిపోయాయి. ఇంకా దుక్కు దున్నని చేలు చాలా ఉన్నాయి. మడులలో మూడు అడుగుల మేర నీరుంటే ఇంకా సాగు పనులు ఎలా చేసేది. మా సమస్యలను చెప్పుకుందామని ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులకు ఫోను చేసినా స్పందించలేదు. గత సార్వా సాగు చేయకుండా వదిలేశాం. ఈసారి కూడా క్రాఫ్ హాలిడే ఇచ్చే పరిస్థితి వచ్చింది.

నీటి నియంత్రణకు ఆదేశాలిచ్చా
పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎంఎల్ఎ

తోకలపల్లి మేజర్ కాల్వ, పత్తేపురం పంట కాల్వలోకి నీటి ప్రవాహాన్ని నియంత్రించేలా కాగుపాడు లాకుల వద్ద చర్యలు తీసుకునేలా అధికారులను అప్రమత్తం చేశాను. రావులపర్రు, బాడవ కింద లోతట్టు ప్రాంతం కావడంతో కొద్దిపాటి నీటికే మునిగిపోయే అవకాశాలు ఉంటున్నాయి. డ్రెయిన్లు ఆక్రమణకు గురయ్యాయి. మురుగునీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు ఆందోళన చెందనవసరం లేదు.

పొలసానిపల్లి గురుకులంను తెరిపించాలి

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి లేఖ రాసిన ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని

ప్రజాశక్తి - భీమడోలు (ఉంగుటూరు)

మండలంలోని పొలసానిపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాలను వెంటనే తెరవడమో లేదా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసేందుకు నిపుణుల కమిటీని పంపాలని కోరుతూ ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు లేఖ రాశారు. గురుకులం మూత... విద్యార్థులు రోడ్డున... శీర్షికన ప్రజాశక్తితో శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పాఠశాల సిబ్బంది 19న గన్ని వీరాంజనేయులును భీమడోలులోని ఆయన కార్యాలయంలో కలిశారు. విద్యా సంవత్సరం వృధా కాకుండా కృషి చేయాలని గన్నిని కోరారు. ఆ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి లేఖ రాస్తూ జెఎన్‌టియు-కాకినాడ నుంచి నిపుణుల కమిటీని త్వరగా పంపించి ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనాలను వినియోగించవచ్చా.. లేదా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలా చూడాలన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిపుణుల కమిటీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని వాట్సాప్‌లో కోరారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం గన్ని వీరాంజనేయులు గురుకుల పాఠశాలను సందర్శించి భవనాలను పరిశీలించారు. రాష్ట్రంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన పొలసానిపల్లి గురుకుల పాఠశాలలో దాదాపు 680 మందికి పైగా విద్యార్థుల చదువుకు ఆటంకం రాకుండా తన వంతు కృషి చేస్తున్నానని గన్ని వీరాంజనేయులు వివరించారు.



గన్నితో మాట్లాడుతున్న పాఠశాల సిబ్బంది

ఉలుకూ పలుకూ లేదాయే..!

జిల్లా పరిధిలో ఏదైనా ప్రధాన సమస్య, పెద్ద ఘటన తెరపైకి వస్తే వెంటనే ప్రజాప్రతినిధులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు స్పందించడం సర్వసాధారణంగా జరిగేది. అయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవల చోటుచేసుకుంటున్న సంఘటనలపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ఉలుకూపలుకూ లేకుండా ఉండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఏజెన్సీలో అధికారుల తీరు గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ఉంటున్న సంగతి అందరికీ తెలిసిందే. దీనిపై ఆయా సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు గిరిజన సంఘాలు, ప్రధానంగా సిపిఎం రంగంలోకి దిగి ఆందోళనలు చేపట్టడం, అధికారులు చర్యలు తీసుకోవడం నిత్యకృత్యం. ఈసారి గిరిజన చట్టాలనే కాదు.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలోని సచివాలయంలో తహశీల్దార్, సర్వేయర్, విఆర్ఓ, విఆర్ఎ, మరో ముగ్గురు గిరిజనేతర రైతులతో అత్యంత రహస్యంగా గ్రామసభ నిర్వహణకు పూనుకోవడం అందరినీ విస్తుపోయేలా చేసింది. ఈ విషయం తెలిసిన ఆ గ్రామ గిరిజనులు, సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు అక్కడికి చేరుకుని నిలదీయగా గ్రామసభ ఫ్లెక్సీ తొలగించి, సమస్యలు తెలుసుకుందామని చెప్పడంతో విస్తుపోవడం గిరిజనుల వంతైంది. ఎందుకంటే ఆ రోజు పిజిఆర్ఎస్‌లో మండల కేంద్రంలో ఉండి వినతులు స్వీకరించాల్సిన తహశీల్దార్ దానికి భిన్నంగా రెడ్డిగణపవరం సచివాలయంలో మకాం వేయడం ఏమిటో, అదీ ఎవరికీ తెలియకుండా ఆ ముగ్గురి గిరిజనేతరుల సమస్యలపైనే ఎందుకంత ఆసక్తో తహశీల్దారనే చెప్పాలి. బుట్టాయగూడెం ఎస్ఐ అక్కడికి చేరుకుని తహశీల్దార్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఇంతవరకూ బాగానే ఉంది. ఈ విషయం వివిధ మాధ్యమాల ద్వారా బాహ్య ప్రపంచానికి తెలిసింది. అయితే దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు ఆర్‌డిఓ, జెసి, కలెక్టర్‌గాని, గిరిజన ఎంఎల్ఎగాని ఎవరూ కనీసం స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. అంటే



ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల అండతోనే తహశీల్దార్ గిరిజన చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఏజెన్సీలోనే ప్రేమజంట వ్యవహారంలో యువకుని తండ్రిని బుట్టాయగూడెం పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి చితకబాదారు. కేన్సర్ పేషెంట్ అనే కనికరమూ లేకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో సదరు వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. దీనిపై ఆదివాసీ గిరిజన సంఘాలు ఆందోళన సైతం నిర్వహించి, కారకుడైన ఎస్ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాయి. కనీసం దీనిపైనా సంబంధిత డివిజన్, జిల్లాస్థాయి అధికారులెవ్వరూ స్పందించకపోవడం గమనార్హం. ఏజెన్సీలో గిరిజనులపై అధికార యంత్రాంగం దమనకాండ సాగిస్తున్నా జిల్లా అధికారులకు పట్టదా, ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవడం లేదా అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇక భీమడోలు మండలం పొలసానిపల్లిలోని గురుకులంలో పాఠశాల ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకూ తెరుచుకోకపోవడం గమనార్హం. కళాశాల తరగతులు ప్రారంభమైనా విద్యార్థిని మృతితో విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోయారని అక్కడి అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ సైతం అసలు అక్కడ పరిస్థితులేమిటీ అనే దానిపై అక్కడ పర్యటించి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు చుట్టుపక్కల కృష్ణా డెల్టా పరిధిలోని పొలాలకు సాగు నీరందక వరి నారుమళ్లు, నాట్లు ఎండుతుండటంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి పశ్చిమగోదావరి జిల్లాలో సాక్షాత్తూ రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి సొంత నియోజకవర్గంలోని యలమంచిలి, పోడూరు, పక్కనే ఉన్న ఆచంట, నరసాపురం మండలాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. జిల్లాలో ముందుకొస్తున్న ప్రధాన సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులే స్పందించకపోతే ప్రజలు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో పాలకులే చెప్పాలి. ప్రజాప్రతినిధులు సైతం తూతూమంత్రపు ప్రకటనలు ఇవ్వడం మినహా స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం రెండు జిల్లాల్లోని ప్రజలు సమస్యలు పరిష్కారం కాక తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రధాన సమస్యలపై ఉలుకూ, పలుకూ లేకుండా పట్టనట్లు వ్యవహరించకుండా, సమస్యలపై కచ్చితంగా స్పందిస్తేనే అధికార యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం నిలిచే అవకాశం ఉంటుంది.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

నిరంతర కష్టమే అసలు శక్తి

ఆర్‌జియుకెటిని సందర్శించిన యుపిఎస్‌సి విజేత సాయి శివాని

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

"మీ నేపథ్యం మీకు అడ్డంకి కాదని, నిరంతర కష్టమే మీ అసలు శక్తి అని యుపిఎస్‌సి విజేత సాయి శివాని అన్నారు. నూజివీడులోని ఆర్‌జియుకెటిలో ఆదివారం నిర్వహించిన యుపిఎస్‌సి ప్రేరణ వ్యూహశిబిరం అనే కార్యక్రమానికి సాయి శివాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేయలేననే ఆత్మన్యూనతను వదిలేసి లక్ష్యంపై దృష్టి ఉంచితే ఐఎఎస్ సాధించడం కష్టం కాదని సూచించారు. కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ ఆమెకు ఆత్మీయంగా స్వాగతం పలికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అసంఖ్యాకంగా వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ 2016-22 సంవత్సరాల మధ్య ఒంగోలు ఐఐఐటిలో ఇసిఇ విభాగంలో చదివిన సాయి శివాని యుపిఎస్‌సి నిర్వహించిన పరీక్షలో జాతీయస్థాయిలో 11వ ర్యాంక్ సాధించడం మన విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు తమ లక్ష్యంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. అనంతరం సాయి శివాని మాట్లాడుతూ చేయలేను అనే ప్రతికూల ఆలోచనా విధానాన్ని విడిచిపెట్టాలన్నారు. క్రమశిక్షణతో, కఠోర శ్రమతో అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని చెప్పారు. యుపిఎస్‌సి జాతీయస్థాయిలో నిర్వహించే ఒకే ఒక పరీక్ష ద్వారా 23 సర్వీసులకు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలను చదివి బేసిక్స్ నుంచి బలమైన కాన్సెప్టులను నిర్మించుకోవాలన్నారు. మీకు మీరే ప్రేరణ కలిగించుకోవాలన్నారు. సోషల్ మీడియాను ఎంతవరకూ ఉపయోగించుకోవాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. నేతృత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, కోచింగ్ కంటే స్వీయ అధ్యయనం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆమె ప్రసంగం అనంతరం విద్యార్థులు ఎక్కువసంఖ్యలో తమ సందేహాలను అడిగారు. తన వ్యక్తిగత జీవితం, తల్లిదండ్రులు తనకు స్ఫూర్తిగా నిలిచిన విధానం, ప్రిపరేషన్ పద్ధతి, ఇంటర్వ్యూ విధానం తదితర ఎన్నో విషయాలను గురించి చెప్పి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం అధ్యాపకుల సమక్షంలో అమరేంద్రకుమార్ ఆమెను మెమెంటో, శాలువతో ఘనంగా సన్మానించారు. పియుసి విద్యార్థినులు పెన్సిల్‌తో గీసిన సాయి శివాని చిత్రపటాన్ని ఆమెకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరుతో పాటు ఎఓ లక్ష్మణరావు, డీన్ చిరంజీవి, డిఎస్‌డబ్ల్యూ, పిఆర్ఓ, చీఫ్ వార్డెన్స్, సుబ్బలక్ష్మి, కళావతి, కృష్ణప్రియ ఇంకా వివిధ శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు.



సాయిశివానిని సత్కరిస్తున్న అమరేంద్రకుమార్

చదరంగం పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రముఖులు

రోటరీ ఆధ్వర్యాన చదరంగం పోటీలు

విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. శ్రీ మల్లాది సీతా రామలింగేశ్వర రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పెనుమర్తి సురేష్‌బాబు, సంధ్య ప్రవల్లిక ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రముఖ చెస్ మాస్టర్, రోటరీ సభ్యులు అయినపర్తి చంద్రశేఖర్ నిర్వహణలో 68 బాల బాలికలకు సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సర్వసభ్య సమావేశంలో చార్టర్ సభ్యులు మల్లాది సీతా రామారావు, చామర్తి శ్రీరాములు, పెద్దలు పాల్గొనగా పోటీల నిర్వహణ తర్వాత గెలుపొందిన వారికి రోటరీ పెద్దలు రామతారకం, పాలపర్తి శ్రీనివాస్, దాకారపు కృష్ణ, కొమ్ముకూరి నాగేశ్వరరావు, జవ్వాజి ఉమా వెంకటేష్, పసల సుబ్బారావు, మాణిక్యాలరావు, ఉడా రాంగోపాల్ చేతులమీద ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించారు.


నంది అవార్డు అందుకుంటున్న డాక్టర్ మనోజ్

డాక్టర్ మనోజ్‌కు నంది అవార్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు మనోజ్ ఆదివారం నంది అవార్డు అందుకున్నారు. మనోజ్ పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను రితిక ఫౌండేషన్ (హైదరాబాద్) ఈ నంది అవార్డును ప్రదానం చేశారు. డాక్టర్ మనోజ్ పేదలకు నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం చేస్తూ ప్రజాసేవ చేయటానికి తనవంతు కృషి చేస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాలను గుర్తించిన రితిక ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిత్యానందచారి చేతులమీదుగా విజయవాడలోని ఆటోనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మనోజ్ నంది అవార్డు అందుకున్నారు. అంబుల మనోజ్ నంది అవార్డు అందుకోవడం పట్ల ముదినేపల్లి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వడాలి జగన్నాథస్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి సింగనపల్లి శ్రీనివాసరావు, సినీ, టీవీ ఆర్టిస్ట్ ఎం.జగదీశ్వరి, డిఎస్‌పి గోదావరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం నేత దుర్గారావు మృతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సిపిఎం బుట్టాయగూడెం మండల కమిటీ మాజీ సభ్యులు కొవ్వాసి దుర్గారావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యురాలు తామ ముత్యాలమ్మ, చంద్రు బుల్లెమ్మ సంతాపం తెలిపారు. కొవ్వాసి దుర్గారావు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. దుర్గారావు కుటుంబానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీలింగ్ భూముల్లో సాగు చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని కేతవరంలో దళిత పేదలకు కేటాయించిన సీలింగ్ భూముల్లో దుక్కు దున్ని సాగు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పేద ప్రజలకు పిలుపునిచ్చారు. కేతవరం సీలింగ్ భూములను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల్లో ఉన్న జిల్లేడు, తుమ్మ మొక్కలను నరికి భూములను దున్నే విధంగా చదును చేయాలని కోరారు. రెవెన్యూ అధికారులు కూడా దళిత పేదల పక్షాన ఉండి పట్టాదారులకు భూములు చెందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జేవి రమణ రాజు, సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ (బాబు), వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గోలిమే బాలయేసు, జిల్లా సహాయ కార్యదర్శి కూరాకుల బాబూరావు, కోనేరు రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సభ్యులు యడ్లపల్లి రమేష్, సీలింగ్ భూముల పట్టాదారులు మంచెల్ల ప్రభాకరరావు, పొట్టి అంకాలయ్య, జి.రమేష్, కొసనం అబ్బులు, రత్తయ్య, పాపమ్మ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన భీమడోలు రైల్వేస్టేషన్ రైల్వే గేటు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఇతను ద్వారకాతిరుమల మండలం సత్తెనగూడెం గ్రామానికి చెందిన కొత్తపల్లి అశోక్(30)గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

సారా తయారు చేస్తున్నవారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చింతలపూడి ఎస్ఐ పి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... కొమ్ముగూడెం గ్రామ సమీపంలో పామాయిల్ తోటలో నాటు సారా స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అదుపులోకి వారి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా, 700 లీటర్ల బెల్లపు ఊట, గ్యాస్ స్టవ్, గ్యాస్ సిలిండర్, అల్యూమినియం పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వల్లంపట్ల పంచాయతీ సింగరాయపాలెం గ్రామానికి చెందిన గొర్రె అనంత (30) భర్త శ్రీనివాస్‌తో గొడవపడి రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె తల్లి దిర్శిపాము విజయ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కేంద్రం చేతిలోకి.. ఉపాధి హామీ స్టీరింగ్!

యుక్తధార యాప్‌తో చట్టం నిర్వీర్యానికి కుట్ర

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం తూట్లు పొడుస్తోందా.. ఇప్పటివరకూ రాష్ట్రాల అజమాయిషీలో ఉన్న ఈ చట్టం నిర్వహణ పూర్తిగా కేంద్రం చేతికి వెళ్లనుందా.. ఇకపై పనుల కల్పన, అంచనాల ప్రక్రియను కేంద్రమే పర్యవేక్షించనుందా.. ఇందులో భాగంగానే నూతన మొబైల్ యాప్ తీసుకొచ్చిందా.. కూటమి ప్రభుత్వం గట్టిగా నిలదీసి డబ్బులు రాబట్టే పనిలో లేదా... అంటే అవుననే సమాధానం వస్తోంది.

ఇదీ సంగతి

ఉపాధి హామీ చట్టం-2005 ప్రకారం ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించేలా చేసింది. ఎపిఒ, ఎంపిడిఒలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. పనుల కల్పన నుంచి, బిల్లుల చెల్లింపుల వరకూ అన్నీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే నడిచేలా చర్యలు తీసుకుంది. ఏదైనా గ్రామంలో కూలీలకు పనులు కల్పించాలంటే ఆయా గ్రామ పంచాయతీలు సామూహికంగా ఒక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించే వెసులుబాటు కల్పించారు. దీనినే సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ అంటారు. దీనిని గ్రామ కార్యదర్శి నిర్వహించాలి. గుర్తించిన పనులను గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ తీర్మానాల అనంతరం మంజూరు చేయాలి. ఇప్పటివరకూ ఇదే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పుడు కేంద్రం ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యాప్‌తో ఇవన్నీ కనుమరుగుకానున్నాయనే ప్రమాదం నెలకొంది.

యాప్‌తో ఏం చేస్తారంటే..

ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'యుక్తధార' పేరిట సరికొత్త మొబైల్ యాప్ తీసుకొచ్చింది. దీని ద్వారా ఉపాధి హామీ పనులను తన అజమాయిషీలో నిర్వహించేందుకు కేంద్రం సర్వం సిద్ధం చేసింది. ఏ రాష్ట్రంలో ఎలాంటి పనులు జరుగుతున్నాయి.. ఏ ప్రాంతంలో ఏ పని ఎప్పుడు పెట్టాలి.. అంచనాలు ఎలా వేయాలి.. బిల్లులు చెల్లింపులు ఎలా జరగాలనే అంశాలన్నింటినీ ఈ యాప్ ద్వారా ఢిల్లీలో కూర్చునే కేంద్ర ప్రభుత్వ అధికారులు నిర్ణయించే అవకాశం కలుగుతుంది. యుక్తధార మొబైల్ యాప్ వినియోగం ఇప్పటికే ప్రారంభమైంది. ఫలితంగా ఉపాధి హామీ చట్టం కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే ఏలూరు జిల్లాలో ఉపాధి హామీలో ఆన్‌లైన్ విధానం వచ్చిన తర్వాత కూలీల సంఖ్య తగ్గింది.

ప్రస్తుతం జిల్లాలో ఉపాధి చట్టం నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువలు, ఇతర భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ యాప్ ద్వారా కేంద్ర పర్యవేక్షణ మొదలైతే భవిష్యత్తులో ఈ పనులన్నీ చేసే వీలుంటుందా.. ఈ చట్టంలో పని చేస్తున్న ఉద్యోగులు ఎవరి పర్యవేక్షణలో విధులు నిర్వర్తించాలి.. రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ యాప్ వల్ల ఉపాధి హామీ చట్టంపై ప్రజలు తమ హక్కులను కోల్పోతారని, ఇది పూర్తిగా చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్య అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో అమలు తీరు

జిల్లాలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కేంద్రం ఇచ్చే టార్గెట్ అమలు చేయడం తప్ప అసలు పని ప్రదేశాల్లో కూలీలు పడుతున్న ఇబ్బందులు, వస్తున్న సమస్యల గురించి ఎక్కడ చర్చ చేయకపోవడం సిగ్గుచేటు. చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకే ఆన్‌లైన్ విధానంలో ఫొటో సిస్టం తీసుకొచ్చి పని ప్రదేశాల్లోనే ఫొటోలు తీసే పద్ధతులను ప్రభుత్వాలు తీసుకొచ్చాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని కాపాడుకోవడం కోసం వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు ఇప్పటికే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహించాయి. జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వంలో 27 మండలాల్లోనూ పర్యటనలు చేయడంతో పాటు కూలీల సమస్యలపై అధికారులను నిలదీస్తూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలనే డిమాండ్ చేస్తూ పోరాడుతున్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంతో పని దినాలు పెంచి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, కూలీల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నాం.

- పివి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

కంకర తవ్వకాల వాహనాలు సీజ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

నల్లమాడు కరెంటు సబ్ స్టేషన్ వద్ద అక్రమంగా కంకర తవ్వుతున్న వాహనాలను రెవెన్యూ అధికారులు ఆదివారం ఉదయం సీజ్ చేశారు. అనంతరం వాటిని చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. ఒక జెసిబి, రెండు లారీలను పట్టుకుని పోలీసులకు అప్పగించామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ పూర్ణ చెప్పారు. అక్రమంగా తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వలసపల్లి సొసైటీ అధ్యక్షునిగా కృష్ణయ్య ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ముసునూరు

తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ, నాయకులకూ శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుందని ఆ పార్టీ మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని వలసపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ నూతన అధ్యక్షులుగా కొల్లి కృష్ణయ్య సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కొల్లి కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ సకాలంలో రుణాలు ఇస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ వలసపల్లి అధ్యక్షులు సురేంద్ర, చెక్కపలి అధ్యక్షులు పెదబాబు, సర్పంచి సత్యనారాయణ, టిడిపి నాయకులు కొల్లి గంగారామ్, మాజీ ఎంపిపి సుబ్బారావు, లక్కపాము కాంతారావు, రైతులు పాల్గొన్నారు.


కృష్ణయ్యను అభినందిస్తున్న టిడిపి నేతలు

మా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు

వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు వాల్ పోస్టర్లను సిపిఎం బుట్టాయగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ అదానీ స్మార్ట్ మీటర్లు ప్రతి ఇంటికీ బిగించాలని కూటమి ప్రభుత్వం పనులు ప్రారంభించిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించి అధికారంలోకొచ్చాక ప్రజలపై విద్యుత్ భారాలు మోపాలని చూస్తుందన్నారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలతో అనేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ స్మార్ట్ మీటర్లు బిగించి అదనపు భారాన్ని పెంచే పని చేస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే పని ఆపాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు ముత్యాలమ్మ, మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కోర్స జలపాలు, పోలోజు నాగేశ్వరరావు, పూనెం శేఖర్, చంద్రు బుల్లెమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, వెట్ట వీరయ్య, మడకం శ్రీదేవి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ఉపాధి హామీ పనులు కల్పించండి

'సుపరిపాలనలో తొలిఅడుగు'లో ఎంఎల్ఎను కోరిన ప్రజలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఉపాధి హామీ పనులు కల్పించాలని ప్రజలు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను కోరారు. చింతలపూడి నగర పంచాయతీ వెలమపేటలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమెటివారిగూడెంలో కొత్త విద్యుత్ స్తంభాలు వేసి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా వెంటనే ఆ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చింతలపూడి నగర పంచాయతీ అవ్వడంతో ఉపాధి హామీ పనులు దొరకడం లేదని స్థానికులు ఆయనకు తెలపగా జిల్లా అధికారులతో మాట్లాడి ఉపాధి పనులు కల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ ప్రెసిడెంట్ తాటి అప్పారావు, జనసేన పార్టీ మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, స్థానిక నాయకులు హనుమంతరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడి : సమస్యలు వింటున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

డిసెంబర్ నాటికి టిడ్కో ఇళ్లు

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ఏలూరు సిటీ :ప్రజలకు డిసెంబర్ నాటికి టిడ్కో ఇళ్లు కట్టించి అప్పగిస్తామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హామీ ఇచ్చారు. స్థానిక 41వ డివిజన్‌లో చోడి దిబ్బ వద్ద ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు సంబంధించి డిసెంబర్ నాటికి ప్రజలకు ఇల్లు కట్టించి అప్పచెప్తామని హామీ ఇచ్చారు. సొంత స్థలాలు ఉన్నవారు ఇల్లు కట్టుకునే ఉద్దేశం ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం రూ.2.50 లక్షలు అందిస్తుందన్నారు. రానున్న కాలంలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, నగర టౌన్ ప్రెసిడెంట్ చోడే వెంకటరత్నం, 41వ డివిజన్ ఇన్‌ఛార్జి జాగాని సంతోషి ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో దాతల సాయం అభినందనీయం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

చిన్నారులకు ఉచితంగా డయాబెటిక్ మందులు, ఇన్సులిన్ ఇంజక్షన్లు

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో దాతల సహకారం ఎంతో అభినందనీయమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. డయాబెటిక్‌తో బాధపడుతున్న చిన్నారులకు రూ.ఐదు లక్షల విలువైన ఉచిత డయాబెటిక్ మందులు, ఇన్సులిన్ ఇంజక్షన్లను అందించేందుకు ఆదిత్య కమర్షియల్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ, చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో దెందులూరు గ్రామంలోని టిటిడి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు డయాబెటిక్ మందులను, ఇన్సులిన్ ఇంజక్షన్లను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని మెరుగైన వైద్య పరికరాలను, మందులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని ఈ అంశంలో స్వచ్ఛందంగా సేవలు అందించడానికి వచ్చే దాతల సహకారాన్ని కూటమి ప్రభుత్వం ఎంతో అభినందిస్తుందన్నారు. దెందులూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సైతం ప్రతినెలా చిన్నారులకు ఉచితంగా డయాబెటిక్ మందులను అందించే విధంగా కూడా చర్యలు చేపడతామన్నారు. దెందులూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేసి ప్రసూతి వార్డును మరింత మెరుగైన వైద్య సేవలందించే విధంగా తీర్చిదిద్దటానికి ముందుకు రావడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆదిత్య కమర్షియల్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ అధినేత వంకినేని భానుప్రకాష్ చౌదరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి దెందులూరు మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, ఆలిండియా అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ జి.మల్లేశ్వరమ్మ, ప్రముఖ డయాబెటిక్ డాక్టర్ పాతూరి విష్ణుప్రియారావు, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ పెనుబోయిన మహేష్‌యాదవ్, టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి వెంకటేశ్వరరావు (వైవిఆర్), టిడిపి నాయకులు కలపాల బుజ్జి, కలపాల శ్రీహరి, తిలక్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నారులకు మందులు అందిస్తున్న చింతమనేని ప్రభాకర్

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎం.చిరంజీవి అన్నారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలిసి యాంటీ ర్యాగింగ్, సోషల్ మీడియా వల్ల జరిగే అనర్థాల గురించి విద్యార్థినులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ యాంటీ ర్యాగింగ్ అనేది ఒక సామాజిక రుగ్మతగా తయారైందన్నారు. చదువుకునే రోజుల్లో సరదాగా చేసే ర్యాగింగ్ వల్ల ఎదుటివారి మనోభావాలకు భంగం కలిగి ఎంతో మనోవేదన చెందుతారని, కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీస్ కేసులు ఉంటే విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. విదేశాల ప్రయాణాలకు, పాస్ పోర్ట్ వెరిఫికేషన్‌కు ఆటంకాలు ఏర్పడతాయన్నారు. ప్రతిఒక్కరూ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరగాళ్లు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు గాలం వేస్తారని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలను నమ్మి మోసపోవద్దన్నారు. ఆన్‌లైన్‌లో రుణాలు తీసుకుని డబ్బులు కట్టినా ఇంకా చెల్లించాలని బెదిరింపు కాల్స్, అసభ్య పదజాలంతో మెసేజులు పంపడం వంటివి చేస్తారన్నారు. ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి మాట్లాడుతూ ఆన్‌లైన్ డిస్కౌంట్ ధరకు వస్తువులు వస్తున్నాయని ఆశపడి డబ్బు చెల్లించి మోసపోయిన వారున్నారన్నారు. దుకాణాల్లో వస్తువుల నాణ్యతను చూసి కొనుగోలు చేయడం మంచిదని, తక్కువ ధరకు వస్తుందని ఆశ పడితే మోసపోక తప్పదని చెప్పారు. అమ్మాయిలు ఎదుటివారికి ఫోన్ నెంబర్లు ఇచ్చే విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

'మానవత' కార్యాలయం ప్రారంభం

చింతలపూడి : మానవత వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.రామచంద్రారెడ్డి ఆలోచన ఎన్నో శాఖలుగా అభివృద్ధి చెంది ఎంతోమంది ప్రజలకు ఉపయోగపడుతుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఫైర్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రారెడ్డి లక్ష్యం ఉన్నతమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కరరావు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KANDREGULA BHAVANI,** W/o. Kandregula Babi, D.No. 5-1/1/1, Ward No.1, Lock Peta, Narasapuram-534275, W.G.Dt. After marriage I have changed my name from **BOKKA SREE BHAVANI DEVI** (Old name) to **KANDREGULA BHAVANI** (New name) hence forth I am being called **KANDREGULA BHAVANI** W/o. Kandregula Babi, for all purposes.

పాస్ పోర్ట్ పోయినది

నేను, ఏలేటి చంద్రకళ, భర్త ఏలేటి చినబాబు, ఇంటి నం. 4- 88/1, మెయిన్ రోడ్, పొలమూరు, పెనుమంట్ర (మం), పశ్చిమగోదావరి జిల్లా. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పేరు పై ఉన్న పాస్ పోర్ట్ **నెం. V 7835338** రు గలది పెనుమంట్ర నుండి తణుకు వెళు తుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు పై అడ్రస్ లోని సెల్ నెంబర్ 6309419318 కు తెలియజేయగలరు.

ఏలేటి చంద్రకళ
W/o. ఏలేటి చినబాబు, ఇంటి నెం. 4- 88/1,
మెయిన్ రోడ్, పొలమూరు,
పెనుమంట్ర (మం), పశ్చిమగోదావరి జిల్లా.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి వారు, సీనియర్ డివిజన్, తాడేపల్లిగూడెం

HMOP.No.50/2025

మధ్య
సబ్బారపు అనే చిటికిన రాజ్యలక్ష్మి ...పిటీషనరు
మరియు
సబ్బారపు లక్ష్మణరావు అనే నాని ...రెస్పాండెంటు

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా ఇందు రెస్పాండెంటుకు తెలియచేయునది ఏమనగా మీపై పై పిటీషనరు దాఖలు చేసిన పిటిషను మీ పై నోటీసు పంపినను మీరు కావలెనని సదరు నోటీసు తీసుకొనక కాలహరణం కావించుచున్నందున సదరు పైకోర్టు వారు మీకు పేపరు పబ్లికేషను ద్వారా యివ్వగలందులకు ఆర్డరు పాసుకావించి సదరు వాయిదాను 23.7.2025 నకు మీ రాక కోసము వేసివున్నారు. కావున సదరు పై వాయిదాకు మీరు ఖుద్దున గాని లేక విషయ పరిజ్ఞానం గల ప్లీడరు గారి ద్వారా వచ్చి సదరు మీ వాదనను వేయగలరు. అటుల కాని పక్షాన మీ ప్రజన్సు లేకనే తీర్పు చెప్పబడునని యిందుమూలముగా తెలియచేయుచున్నాము.

పంపవలసిన అడ్రసు :
Sri Subbarapu Lakshmanarao, Son of Tatababu 28 Yrs, Hindu, Private Employment, Working at Sai Vilas Hotel, Jublee road, Tadepalligudem, Presently Residing at Chitikena Raja Babu, C/o.Gangireddi House, Narasimaraopet, ward 17th Gorrela Sridhar Street, Tadepalligudem

బై ఆర్డరు ఆఫ్ ది కోర్టు
యాళ్ళబండి రామకృష్ణ పరమహంస
తాడేపల్లిగూడెం అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తేది.29.7.2025 సెల్: 6303018736

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల తగాదాల పరిష్కార కమిషన్ - విజయవాడ
ఎఫ్.ఎ.నెం.250 ఆఫ్ 2024 సి.సి. నెం.46 ఆఫ్ 2023
(తేది: 29-02-2024న రాజమహేంద్రవరం వద్ద తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఫైల్‌లో)

బిట్వీన్ :
ఒకినావా ఆటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ డైరెక్టర్, కార్పొరేట్ ఆఫీస్, యూనిట్ నెం. 651-654, 6వ అంతస్తు, జె.ఎం.డి మెగాపోలీస్ సెక్టార్ 48, సహాన్ రోడ్, గుర్గావ్ హర్యానా ఇండియా- 122018.
.....పిటిషనర్/అప్పిలెంట్
మరియు :
శ్రీ లక్ష్మీ వెసికేర్ మోటార్స్ మరియు ఇతరులు
....రెస్పాండెంట్
టు,
ఆర్-4: శ్రీ లక్ష్మీ వెసికేర్ మోటార్స్, దాని యజమాని ప్రతినిధి డోర్ నెం. 7-273, వేల్పూరి రోడ్ తణుకు పశ్చిమ గోదావరి జిల్లా.534211.
4వ ఎదురుగా ఉన్న పార్టీ

గౌరవ కమీషనర్ వారి అనుమతితో తెలియజేయునది ఏమనగా పైన ఉదహరించిన అప్పీల్‌లలో అప్పిలెంట్ సి.సి.నెం: 46 అఫ్ 2023 అప్పీల్ దాఖలు చేసివున్నారు, మీకు పలుమార్లు నోటీసు పంపినప్పటికీ మీరు హాజరు కావడంలేదు. సదరు కమిషనర్ వారి ఉత్తరువుల మేరకు, **తే 04-08-2025దిన వాయిదా ఉన్నది. మీరు ఉ॥ 10.30గం॥లకు హాజరు కాగలరు.** మీకు నోటీసును ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము. మీరు కానీ మీతరపున న్యాయవాది ద్వారా కానీ పైన తెలిపిన వాయిదా నాడు గౌరవ కమిషనర్ ఎదుట హాజరుకావలెను.
అప్పీల్ వాయిదా : 04-08-2025

జాగర్లపూడి వెంకటేశ్వర ప్రసాద్
జాగర్లపూడి లక్ష్మి శివనారాయణ
న్యాయవాదులు,
41 -5 -16 పాత పోలీస్ స్టేషన్ రోడ్,
కృష్ణలంక, విజయవాడ, ఫోన్: 9440696216.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల తగాదాల పరిష్కార కమిషన్ - విజయవాడ
ఎఫ్.ఎ.నెం.250 ఆఫ్ 2024 సి.సి. నెం.46 ఆఫ్ 2023
(తేది: 29-02-2024న రాజమహేంద్రవరం వద్ద తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఫైల్‌లో)

బిట్వీన్ :
ఒకినావా ఆటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ డైరెక్టర్, కార్పొరేట్ ఆఫీస్, యూనిట్ నెం. 651-654, 6వ అంతస్తు, జె.ఎం.డి మెగాపోలీస్ సెక్టార్ 48, సహాన్ రోడ్, గుర్గావ్ హర్యానా ఇండియా- 122018.
.....పిటిషనర్/అప్పిలెంట్
మరియు :
శ్రీ లక్ష్మీ మోటార్స్ మరియు ఇతరులు
....రెస్పాండెంట్
టు,
ఆర్-2: శ్రీ లక్ష్మీ మోటార్స్, దుర్గా ఆలయం ఎదురుగా దాని యజమాని ప్రతినిధి, జువ్వలపాలెం, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా, పిన్ - 534102.

గౌరవ కమిషనర్ వారి అనుమతితో తెలియజేయునది ఏమనగా పైన ఉదహరించిన అప్పీల్‌లలో అప్పిలెంట్ సి.సి.నెం: 46 అఫ్ 2023 అప్పీల్ దాఖలు చేసివున్నారు, మీకు పలుమార్లు నోటీసు పంపినప్పటికీ మీరు హాజరు కావడంలేదు. సదరు కమిషనర్ వారి ఉత్తరువుల మేరకు, **తే 04-08-2025దిన వాయిదా ఉన్నది. మీరు ఉ॥10.30గం॥లకు హాజరు కాగలరు.** మీకు నోటీసును ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము. మీరు కానీ మీతరపున న్యాయవాది ద్వారా కానీ పైన తెలిపిన వాయిదా నాడు గౌరవ కమిషనర్ ఎదుట హాజరుకావలెను.
అప్పీల్ వాయిదా : 04-08-2025

జాగర్లపూడి వెంకటేశ్వర ప్రసాద్
జాగర్లపూడి లక్ష్మి శివనారాయణ
న్యాయవాదులు,
41 -5 -16 పాత పోలీస్ స్టేషన్ రోడ్,
కృష్ణలంక, విజయవాడ, ఫోన్: 9440696216.